కుష్టుపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: కుష్టువ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో కుష్టు వ్యాధి నివారణపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి వచ్చిన వారిపట్ల వివక్ష చూప వద్దన్నారు. వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, కౌన్సిలర్లు, డాక్టర్ కె.కుమార్, డాక్టర్ సింధుజా, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ ఎస్సీనగర్ రోడ్డు నంబర్–2లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కౌన్సిలర్ మమతకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆట వస్తువులు ప్రారంభం


ఆట వస్తువులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి

కీసర: గోధుమకుంట గ్రామపంచాయతీ అనుబంధ కాలనీ అయిన ఎలిఫెంట్ ఎన్‌క్లేవ్, ఎలిఫెంట్ ఎన్‌క్లేవ్ ఏ బ్లాక్‌లలోని పార్కు స్థలాల్లో పిల్లలు ఆడుకొనేందుకు మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన పిల్లల ఆటవస్తువులను ప్రారంభించారు. మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు మంచాల కిరణ్‌జ్యోతిప్రవీణ్, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విరాట్ హిందూ సమ్మేళనానికి ఆహ్వానం


చిన్న జీయర్‌స్వామితో మేడ్చల్‌లోని హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు

మేడ్చల్: అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ సందర్భంగా మేడ్చల్ ప్రాంతంలో అక్షితల వితరణ చేసిన హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు త్రిదండి చిన్న జీయర్ స్వామిని కలిశారు. మేడ్చల్‌లో ఈ నెల 18న నిర్వహించే విరాట్ హిందూ సమ్మేళనానికి హాజరు కావాలని కోరుతూ ఆయనను కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మేడ్చల్ మాజీ సర్పంచ్ మురళీధర్‌గుప్తా, నాయకులు సుధాకర్‌రెడ్డి, కిషన్‌రావు, మల్లిఖార్జున్, వెంకన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ షో

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన మ్యాజిక్ షో విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. మెజీషియన్లు మధుసూదన్, వేణుబాల, మహదేవ్‌కృష్ణ నిర్వహించిన పలు మ్యాజిక్‌లు విద్యార్థులను అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ నిత్యం బిజీగా ఉండే విద్యార్థులకు ఈ మ్యాజిక్ షో ఆట విడుపుగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీంతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, ఆనందం పెరుగుతుందన్నారు. విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డొస్తున్నాయని.. అడ్డంగా నరికేస్తూ..



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో విద్యుత్ అధికారులు కరెంటు తీగలకు అడ్డు వచ్చే కొమ్మలను తొలగించాల్సి ఉండగా, కొన్ని ప్రాంతాల్లో చెట్ల మొదళ్ల వరకు నరుకుతున్నారు. మున్సిపల్ అధికారులు కోట్లాది రూపాయలు వెచ్చించి చెట్లను కాపాడుతుండగా.. కొంత మంది విద్యుత్ అధికారులు ఆ చెట్లను ఇష్టారాజ్యంగా కొట్టేస్తున్నారు. దీంతో స్థానికుల్లో నిరసన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో చెంగిచర్లలోని ఎస్‌ఆర్‌సీఎం రోడ్డులో ఎత్తయిన కరెంట్ తీగల కింద మొక్కలు నాటారు. అవి ఏపుగా పెరగడంతో కరెంట్ తీగలకు అడ్డు వస్తాయని, మోము వరకు నరికారు. మున్సిపల్, విద్యుత్ అధికారులు చొరవ తీసుకుని చెట్లు నరికే సమయంలో కరెంట్ తీగలకు అడ్డు వచ్చే కొమ్మలను మాత్రమే నరకాలని, ఇష్టారాజ్యంగా చెట్లను నరకొద్దని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి

గౌతంనగర్: అన్నపూర్ణ సొసైటీలో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను సొసైటీ వారు ఆక్రమించుకుని ఉపయోగించుకోవాలని చూశారు. సమాచారం అందుకున్న మల్కాజిగిరి మండల ఆర్‌ఐ శ్రీశైలం కమ్యూనిటీ హాలును తమ ఆధీనంలోకి తీసుకుని సొసైటీ బోర్డును తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

పెన్షన్ ఇప్పించండి సారూ..

కాప్రా: మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీకి చెందిన బండారి లక్ష్మీ అనే మహిళ పెన్షన్ కోసం గురువారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసింది. కొంత కాలంగా వికలాంగుల పెన్షన్ కోసం ఎన్ని ఆఫీసులు తిరిగినా లాభం లేదని, ఎంత మంది అధికారులను కలిసినా ఫలితం లేదని వాపోయింది. చిరువ్యాపారంతో చాలీచాలని డబ్బులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నానని ఆవేదన వ్యక్తం చేసింది. నాలుగేళ్లు గడుస్తున్నా పెన్షన్ రావడంలేదని, పెన్షన్ వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి వేడుకుంది.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

కాప్రా: వంపుగూడలోని సర్వే నంబర్ 102లో గల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని కాప్రా మండల తాహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంపుగూడలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడి ప్రజా అవసరాలకు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పత్తికుమార్, నాగరాజు, శ్రీనివాస్, రాజు, ఆరీఫ్, షాబుద్దీన్, శ్రీధర్‌రెడ్డి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

‘జలమండలి’ జాడేది?

- సబ్ డివిజన్‌లో సమస్యలెన్నో..?
- కలుషిత నీరు, మురుగుతో ఇబ్బంది
- అధికారుల జాడలేదని అసంతృప్తి
- డీజీఎం సతీష్‌కుమార్‌పై ఆరోపణలు
- సమాచారం చేరవేతలో నిర్లక్ష్యం
- ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి



కాప్రా జలమండలి సబ్ డివిజన్‌లోని రాధిక సెక్షన్ కార్యాలయం

కాప్రా: తాగునీరు, డ్రైనేజీ సమస్యతో కాప్రా సర్కిల్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి సిబ్బంది లేక జనం ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థంకాక అయోమయ పరిస్థితులకు గురవుతున్నారు. ఒక్కో సిబ్బందికి అదనపు సెక్షన్లు ఉండటంతో క్షేత్రస్థాయి సిబ్బంది కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. సర్కిల్ పరిధిలో జలమండలి ఉన్నతాధికారి జాడ దొరకడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మురుగునీటితో తిప్పలు

తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు, డ్రైనేజీ లీకేజీలతో మురుగు ఇళ్ల ముందు చేరి దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల రోడ్లపై మురుగు చేరి ఇళ్లలోకి కూడా చేరుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల తాగునీటిలో మురుగు నీరు కలిసి కలుషితమై సరఫరా అవుతున్నా.. అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలుషితనీరు తాగి రోగాలబారిన పడే ప్రమాదం ఉందని జనం ఆవేదనకు గురవుతున్నారు.

పట్టించుకునే పరిస్థితి లేదు

సర్కిల్‌లోని జలమండలికి సంబంధించిన సమస్యల గురించి జనం చెప్పుకోవాలంటే అది వినే నాథులే కరువయ్యారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక సర్కిల్‌లోని జలమండలి డీజీఎం సతీష్‌కుమార్ జాడే దొరకదని కొందరు వాపోతున్నారు. ఆయన కనీసం ప్రత్యక్షంగా దర్శనం ఇవ్వకపోయినా ఫోన్‌లో అయినా సమస్యలు తెలపాలంటే అందుబాటులోకి రారనేది జనం నోట వినిపిస్తున్న మాట. ఒక వేల పొరపాటున ఫోన్ ఎత్తినా ఆఫీసుకు రావాల్సిందిగా సూచిస్తున్నారు. ఫోన్‌లో ఎలాంటి సమాచారం ఇచ్చేది ఉండదు, ఫిర్యాదు తీసుకునేది ఉండదని దురుసుగా తేల్చి చెబుతారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం తన పరిధిలో ప్రజలకు చేరవేయాల్సిన సమాచారం కూడా డీజీఎం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారనేది జనం నోట వినిపిస్తున్న ఆరోపణలు.

అవినీతి ఆరోపణలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో డీజీఎం సతీష్‌కుమార్ ఆడిందే.. ఆట పాడిందే పాట అన్నచందంగా ఉండేదని సర్కిల్‌లో ఈ నోట, ఆ నోట వినపడుతున్న మాట. గతంలో ఓ కాలనీలో పైప్‌లైన్ కోసం డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపణలు వినిపించాయి. ఈ విషయం నాటి ఎమ్మెల్యే దృష్టికి కూడా వెళ్లిందని, సదరు డీజీఎంకు క్లాస్ తీసుకున్నారని, ఆ తర్వాత ఆ విషయం సద్దుమనిగేలా డీజీఎం ప్రయత్నాలు చేశారని పుకార్లు షికార్లు చేశాయి. కానీ ఈ విషయం ఎక్కడా అధికారికంగా బయటకు రాలేదు. ఓ విషయంలో తనను కాపాడుకునేందుకు ఓ అధికారిపై కూడా ఎండీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి..

జలమండలి కాప్రా సబ్ డివిజన్ డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న సతీష్‌కుమార్‌కు రాధిక సెక్షన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు కూడా ఉన్నాయి. కాప్రా సబ్ డివిజన్‌లోని ఐదు సెక్షన్లకు డీజీఎంగా బాధ్యతలతో పాటు రాధిక సెక్షన్ కార్యాలయం ఇన్‌చార్జి బాధ్యతలు ఉండటంతో ఆయన ఎక్కడుంటారో ప్రజలకు తెలియని పరిస్థితి. దీంతో సమస్యలు చెప్పుకునేందుకు సంబంధిత అధికారులు దొరక్క సర్కిల్ వాసులు ఇబ్బందుల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండరనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు కీసర మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కీసర: నేడు కీసర మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తామని ఎంపీడీఓ గ్యామనాయక్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

కేసీఆర్‌కు శుభాకాంక్షలు



మల్కాజిగిరి: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శస్త్ర చికిత్స అనంతరం కేసీఆర్ కోలుకొని ప్రజల్లోకి రావడం సంతోషంగా ఉందని, ఆయన ఆధ్వర్యంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు.

పరామర్శ

అల్వాల్: వెంకటాపురం డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణ ఇటీవల బైక్ ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎంటీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నందికంటి శ్రీధర్ గురువారం కృష్ణను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళా లోకం సంఘటితంగా ఉద్యమించాలి


మాట్లాడుతున్న మహిళా సంఘాలు

జవహర్‌నగర్: అఖిల భారత విప్లవ మహిళా సంఘం సంపంగి పద్మ అధ్యక్షతన జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో నిర్వహించిన సమావేశంలో మేడ్చల్‌లోని మూడు విప్లవ మహిళా సంఘాలు గురువారం ఏకమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలను నెట్టివేసే కుట్రలకు వ్యతిరేకంగా శ్రామిక మహిళా లోకం సంఘటితంగా ఉద్యమించాలన్నారు. దేశంలో మతం ముసుగులో చేస్తున్న భయంకరమైన కుట్రలను తిప్పికొట్టేందుకు మూడు విప్లవ మహిళా సంఘాలు ఐక్యమవ్వడం అభినందనీయం అన్నారు. మహిళలను గౌరవిస్తేనే దేశం బాగుపడుతుందని, మహిళా శక్తితో ఏదైనా సాధించవచ్చని అన్నారు. మూడు విప్లవ సంఘాలు కలిసి ఇండియన్ ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఉమెన్స్(భారత ప్రగతిశీల మహిళా సంఘం)గా కొనసాగుతుందని విలీన ప్రకటన చేశారు. పీవోడబ్ల్యూ(విముక్తి), ఎం.పుణ్యవతి, పీవోడబ్ల్యూ(స్త్రీ విముక్తి–రామచంద్రయాన్), బి.పావనీ, అఖిల భార విప్లవ మహిళా సంఘం సంపంగి పద్మ మూడు సంఘాలు కలిసి ఐక్యమయ్యాయి. కార్యక్రమంలో ఇఫ్లు షేక్ షావలీ, చిట్టిబాబు, రషీద్, సుధాకర్, పీవోడబ్ల్యూ మహిళా సంఘాలు పాల్గొన్నారు.

పీర్జాదిగూడ మేయర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు

కీసర: పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డిపై కీసర పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, కేసు నమోదైంది. కీసర సీఐ వెంకటయ్య వివరాల ప్రకారం భోగారం గ్రామంలో సర్వే నంబర్–286‘ఆ’ ఆలోని 30 గుంటల భూమిని 1978 సంవత్సరంలో ప్రభుత్వం భోగారం గ్రామానికి చెందిన గూడె భిక్షపతికి కేటాయించింది. అతడి కుటుంబ సభ్యులు కొన్నేళ్లు వ్యవసాయం చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరు ఎండిపోవడంతో వ్యవసాయం చేయకుండా వదిలేశారు. పక్కనే వెంచర్ చేసిన పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు రైతుకు సంబంధించిన భూమిని సైతం కలుపుకొని వెంచర్ చేశారు. తమ భూమిని ఎందుకు ఆక్రమించారని అడిగితే దళితుడైన తనపై దౌర్జన్యం చేస్తూ చంపేస్తానని బెదిరించాడని రైతు కుమారుడు మల్లేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ముగిసిన ద్రవ్యక అంతర్జాతీయ సదస్సు

కీసర: చీర్యాలలోని గీతాంజలి ఫార్మసీ కళాశాలలో ద్రవ్యక 2024 పేరిట రెండు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. గురువారం ముగింపు కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జి.ఆర్.రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఔషధ శాస్త్రంలో నిపుణులయ్యేందుకు ఔత్సాహిక శాస్త్రవేత్తలకు శాస్త్రీయ పరిజ్ఞానం అందించేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఔషధ పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. సదస్సులో దేశం నలుమూలల నుంచి 570 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రవికుమార్, డా.ఎం.అజిత, అనాలిస్ ల్యాబ్ మేనేజర్ డా.శ్రీధర్‌వాగంటి, ఎం.చెన్నారెడ్డి, కేన్సర్ రీసెర్చ్ సైంటిస్ట్ మలేషియా విశ్వవిద్యాలయం అధ్యాపకులు డా.తన పాకియం, గణేషన్, డా.సహ్లా ఎల్కుద్సియా, ఇస్మాయిల్ డా.అల్లూరి రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

8న ఓటర్ల తుది జాబితా



మల్కాజిగిరి: ఓటర్ల తుది జాబితాను ఈ నెల 8వ తేదీ ప్రకటిస్తామని ఓటరు నమోదు అధికారి జి.రాజు తెలిపారు. మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత నెల 22వ తేదీ వరకు వచ్చిన నూతన ఓటరు నమోదు దరఖాస్తులు, చేర్పులు మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించామని వారికి తెలియజేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ శాతం పెరగడానికి సహకరించాలని కోరారు. శామీర్‌పేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంల తనిఖీకి రావాల్సిందిగా కోరారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన విష్ణువర్ధన్‌రావు, కాంగ్రెస్ నుంచి పిట్టల శ్రీనివాస్, బీజేపీ నుంచి రామకృష్ణ, బీఎస్పీ నుంచి గౌతం రాజు హాజరయ్యారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య


నిమ్మగళ్ల నరేష్(ఫైల్)

మల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ సారంగపాణి తెలిపిన వివరాల ప్రకారం నాచారం దుర్గానగర్‌కు చెందిన నిమ్మగళ్ల గోపాల్ కుమారుడు నిమ్మగళ్ల నరేష్(23) ఆటో డ్రైవర్. బుధవారం రాత్రి 11.30కి ఆటో తీసుకువచ్చి ఇంటికి వచ్చి పడుకున్నాడు. ఇంట్లోని మరో గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతున్నాడు. అప్పటికే మృతి చెందాడు. కొన్ని రోజులుగా ఆటో సరిగ్గా నడవక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడని కుటుంబ సభ్యులు అన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి మాధవరెడ్డి చౌరస్తా వద్ద బస్ షెల్టర్ నిర్మాణం కోసం గ్రామ సర్పంచ్ భూమి పూజ చేశారు. సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ ఈశ్వరచంద్ర ఫౌండేషన్ ద్వారా బస్ షెల్టర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో ప్రభుత్వ నిధులు, సొంత నిధులు, కంపెనీల సీఎస్‌ఆర్ నిధులు, దాతల విరాళాలతో సమగ్రంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమణారెడ్డి, భగవాన్‌దాస్, గోపాల్, రవీందర్ గౌడ్, సుధాకర్ తదితరులు ఉన్నారు. గౌడవెల్లి మాధవరెడ్డి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ విగ్రహాన్ని నాయకులు ఆవిష్కరించారు.

పాత సామగ్రి వేలం



ఘట్‌కేసర్: పురపాలక సంఘం పరిధిలోని కొండాపూర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం పాత సామగ్రిని మున్సిపల్ అధికారులు వేలం వేశారు. అత్యధికంగా కిలో రూ.91 చొప్పున భోలక్‌పూర్‌కు చెందిన అతర్ మొహియుద్దీన్ దక్కించుకున్నారు. చైర్ పర్సన్ ముల్లి పావని, వైస్ చైర్మన్ పలుగుల మాధవ్‌రెడ్డి, కౌన్సిలర్ల సమక్షంలో మున్సిపల్ అధికారులు వేలం నిర్వహించారు.

నకిలీ బంగారం విక్రయించిన ఇద్దరిపై కేసు

మల్కాజిగిరి: తక్కువ ధరకే బంగారం విక్రయిస్తున్నామని మోసం చేసిన భార్యాభర్తలను 24 గంటల్లో మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ వివరాల ప్రకారం కృష్ణా జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లు(46), తిరుపతమ్మ (40) ఇబ్రహీంపట్నంలో ఉంటూ ప్లాస్టిక్ సామాన్లు విక్రయిస్తుంటారు. గత నెల 31వ తేదీన మల్కాజిగిరి హనుమాన్‌పేట్‌లో కూరగాయలు విక్రయించే ఇంద్రజ వద్దకు వెళ్లి తమ వద్ద బంగారం ఉందని, అవసరానికి అమ్ముతున్నామని నమ్మించి రూ.1.40 లక్షలు తీసుకొని నకిలీ బంగారు ఆభరణాలు అందజేశారు. బంగారం దుకాణంలో విచారిస్తే నకిలీ అని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మల్కాజిగిరిలో వారిని అదుపులోకి తీసుకున్నారు.

వృద్ధుడి అదృశ్యం

కుషాయిగూడ: ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఎస్‌ఐ ఉపేందర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి, తాడేపల్లిగూడానికి చెందిన శృంగారం శేషరత్నం కుటుంబ సభ్యులతో కలిసి సైనిక్‌పురి, వాయుపురిలో స్థిరపడి ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం భార్యాభర్తలు ఉద్యోగానికి వెళ్లగా, పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. సాయంత్రం అతడి తండ్రి శృంగారం విజయ రాఘవన్(71) వాకింగ్ వెళ్తున్నాని తన భార్యకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

అల్వాల్: అనుమానాస్పద స్థితిలో ప్రైవేటు ఉద్యోగిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి కిందపడి మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాకు చెందిన సూర్యకుమారి(24) శామీర్‌పేట్‌లోని ఫార్మా కంపెనీలో పనిచేస్తూ అల్వాల్ తిరుమల ఎన్‌క్లేవ్‌లోని ఓ హాస్టల్‌లో నివాసం ఉంటోంది. గురువారం రాత్రి హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి కిందపడి గాయాల పాలైంది. ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదవశాత్తు కింద పడిందా..? లేక ఆత్మహత్యకు పాల్పడిందా? అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల ప్రత్యేక అధికారులు వీరే..

మేడ్చల్: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియమించారని ఎంపీడీఓ జె.పద్మావతి తెలిపారు. మండలంలోని 17 గ్రామాలకు జిల్లా, మండల, డివిజన్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. బండమాదారం మండల వ్యవసాయాధికారి అర్చన, డబీల్‌పూర్, రాజబొల్లారంలకు కీసర ఎంపీఓ వినూత్న, గౌడవెల్లికి తహసీల్దార్ శైలజ, కోనాయిపల్లి, లింగాపూర్‌లకు ఎంపీడీఓ జె.పద్మావతి, మైసిరెడ్డిపల్లి, మునీరాబాద్‌కు ఎంపీఓ రవి, నూతన్‌కల్‌కు జిల్లా వ్యవసాయాధికారి మేరి రేఖను నియమించారు. పూడూర్‌కు జెడ్పీ సీఈఓ దేవసహాయం, రాయిలాపూర్‌కు జిల్లా ఉద్యానవన అధికారి నీరజగాంధీ, రాజబొల్లారం తండాకు జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రెడ్డి, రావల్‌కోల్‌కు ఎస్‌డీసీ వంశీమోహన్, సైదనిగడ్డ తండాకు డిప్యూటీ తహసీల్దార్ దిలీప్ కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీఓ తెలిపారు.

మూడుచింతలపల్లి మండలంలో..

శామీర్‌పేట్: ఆద్రాస్‌పల్లి, అనంతారం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా వి.సునీత (మూడు చింతలపల్లి ఎంపీఓ), కొల్తూర్, జగన్‌గూడ గ్రామాలకు వాణిరెడ్డి(ఎంసీపల్లి మండల తహసీల్దార్), కేశ్వాపూర్, కేశవరం గ్రామాలకు వత్సలదేవి (ఎంసీపల్లి ఎంపీడీఓ), లక్ష్మాపూర్‌కు బాలాజీ (ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్), లింగాపూర్ తండాకు వినోద్‌కుమార్(ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి, మేడ్చల్ జిల్లా), మూడుచింతలపల్లికి నాగజ్యోతి(మండల డిప్యూటీ తహసీల్దార్), నాగిశెట్టిపల్లికి కేశురాం(జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి), నారాయణపూర్‌కు రాజేందర్(సివిల్ సప్లయ్ మేనేజర్, మేడ్చల్ జిల్లా), పోతారం గ్రామానికి మాధవి(వ్యవసాయ అధికారి, కీసర), ఉద్దమర్రికి కృష్ణవేణి (వ్యవసాయ అధికారి, మూడుచింతలపల్లి).

శామీర్‌పేట మండలంలో..

అలియాబాద్‌కు సత్యనారాయణ(తహసీల్దార్, శామీర్‌పేట్), బాబాగూడకు వెంకటేష్(జిల్లా ఆడిటింగ్ అధికారి), బొమ్మరాశిపేటకు వాణి(ఎంపీడీఓ, శామీర్‌పేట్), లాల్‌గడి మలక్‌పేటకు శ్రీనివాస మూర్తి (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆర్అండ్‌బీ), మజీద్‌పూర్‌కు పూర్ణిమ(జిల్లా మత్స్యశాఖ అధికారి), మురహరిపల్లికి ప్రసన్నలక్ష్మీ(డిప్యూటీ తహసీల్దార్, శామీర్‌పేట), పొన్నాల్‌కు రమేష్(వ్యవసాయ అధికారి, శామీర్‌పేట్), శామీర్‌పేట్‌కు తనూజ(జిల్లా పౌర సరఫరాల అధికారి), తుర్కపల్లికి సైదులు (ఎస్‌డీసీ – ఎల్‌ఏ), యాడారం గ్రామానికి మంగ తాయారు(ఎంపీఓ, శామీర్‌పేట్).

ఘట్‌కేసర్ మండలంలో..

ఘట్‌కేసర్: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గురువారం నుంచి ఘట్‌కేసర్ మండల పరిధిలోని గ్రామాలు ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లాయి. అంకుషాపూర్ గ్రామానికి ఎంపీడీఓ వై.అరుణారెడ్డి, అవుషాపూర్ గ్రామానికి డీహెచ్‌ఎస్‌ఓ నీరజాగాంధీ, చౌదరిగూడాకు డీఆర్‌డీఓ కే.పద్మజారాణి, ఏదులాబాద్‌కు పంచాయత్ ఆఫీసర్ బి.నందకిషోర్, ఘన్‌పూర్‌తో పాటు ప్రతాపసింగారానికి డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డీ.సరిత, కాచవానిసింగారానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీ.దేవసహాయం, కొర్రెముల్‌కు డిప్యూటీ తహసీల్దారు రఘువర్ధన్‌రెడ్డి, మాదారానికి జిల్లా యువజన క్రీడల అధికారి బీ.బలరామారావు, మర్పల్లిగూడకు జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జీ.వినోద్ కుమార్ ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు.

కీసర మండలంలో...

కీసర: నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది. గ్రామసర్పంచుల పదవీ కాలం ముగియడంతో మండలంలోని 10 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. అంకిరెడ్డిపల్లి గ్రామపంచాయతీకి అశోక్‌కుమార్(కీసర తహసీల్దార్), భోగారం జి.రాజేందర్(జిల్లా మేనేజర్ సివిల్ సప్లయ్), చీర్యాల, పద్మజారాణి(జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అధికారి), గోధుమకుంట పి.రవీందర్(జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్) కరీంగూడ, లింగస్వామి(అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ జిల్లా మైన్స్ జియాలజిస్ట్) కీసర నందకిషోర్(మండల పంచాయత్ ఆఫీసర్ ఘట్‌కేసర్(ఎంపీఓ), నర్సంపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలకు, గ్యామనాయక్(కీసర ఎంపీడీఓ) రాంపల్లిదాయర శశిధర్(కీసర, ఎంఈఓ) యద్గార్‌పల్లి పి.ప్రభావతి(అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్) ప్రత్యేకాధికారులుగా విధులు నిర్వహించనున్నారు.

గౌడవెల్లి పాలకవర్గానికి సన్మానం


గౌడవెల్లి పాలక వర్గం

మేడ్చల్: గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో గౌడవెల్లి పాలకవర్గాన్ని సన్మానించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు, గ్రామ ప్రముఖులు పాలకవర్గాన్ని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్, ఉపసర్పంచ్ పెంటమ్మ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

ఘట్‌కేసర్: గ్రామ పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పారిశుద్ధ్య కార్మికులను అవుషాపూర్ సర్పంచ్ కావేరీ మచ్చేందర్‌రెడ్డి సౌజన్యంతో గురువారం సత్కరించి, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన కార్మికులకు తనవంతు సహకారం అందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మచ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బసవరాజు గౌడ్, సత్యనారాయణరెడ్డి, గుండె నరేష్, సాయిలు, కాసుల వెంకటేశ్ గౌడ్, గడిల వెంకటేశ్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


కార్మికులను సత్కరిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి